క్లుప్తంగా

బాధితులకు రెడ్ క్రాస్ ఆర్థిక సాయం



కొప్పిగుంటలో అగ్నిబాధితులకు ఆర్థికసాయం అందచేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

కాట్రేనికోన: ఇటీవల కొప్పిగుంటలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్నిప్రమాద బాధితులు కడలి సత్యవతి కుటుంబానికి శనివారం రెడ్ క్రాస్ సొసైటీ ఆర్థికసాయం చేసింది. కోనసీమ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాలతో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ) సూచనలతో అగ్నిబాధిత కుటుబానికి వంట సామగ్రి, టార్పాలిన్, హైజినిక్ కిట్లను అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ రత్నప్రసాద్, కముజు శ్రీనివాసరావు, రామ సుబ్రమణ్యం, వాసంశెట్టి శ్రీనివాసరావు, కొప్పిశెట్టి మల్లికార్జునరావు, శ్రీహరి సత్యనారాయణ, వెర్రియ్య, గుత్తుల గోపాలం తదితరులు ఉన్నారు.

పలు బాధిత కుటుంబాలకు 'పొన్నాడ' పరామర్శ



పటవలలో కొటికెలపూడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పొన్నాడ తదితరులు

తాళ్లరేవు: మండలంలోని పలు గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శనివారం పరామర్శించారు. పటవల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొటికెలపూడి సూర్యకాంతం, దంగేటి అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామానికి చెందిన నామాడి అబ్బాయి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయా కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆయనవెంట కాట్రేనికోన జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, దొరబాబు, పోతుల రత్నకుమారి, దడాల పండు, వేగేశ్న రామరాజు, నల్లి శ్రీనివాస్, కాలా వెంకటరమణ, కొప్పిశెట్టి వెంకట్, కొటికెలపూడి చందు, వెంటపల్లి వెంకటరమణ, చక్కపల్లి లక్ష్మణ్, నరాల శ్రీనివాస్, కడియాల కృష్ణ, ఊబ కామేశ్వరరావు, ముద్రే అన్నవరం, మేకల రాము తదితరులు ఉన్నారు.

ఎస్సీల విద్యారుణాలు మంజూరు చేయాలి

యానాం: ఆదిద్రావిడశాఖ ద్వారా ఎస్సీ విద్యార్థులకు మంజూరు చేసే రుణాలను ప్రభుత్వం విడుదల చేయాలని శనివారం పలువురు అభ్యర్థుల తల్లిదండ్రులు కోరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యారుణాల మంజూరులో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యాసంవత్సరం విద్యా రుణాల దరఖాస్తులను రెన్యూవల్ చేయించుకోవాల్సివుంటుందని ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

స్వాతంత్య్ర వేడుకల ఖర్చు పెంపుపై హర్షం

అయినవిల్లి: ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం ఖర్చులకు పంచాయతీలకు ఇచ్చే ఫండ్ పెంచడంపై సర్పంచుల సమాఖ్య మండలశాఖ అధ్యక్షురాలు వార జయసావిత్రి ఆధ్వర్యంలో సర్పంచులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. మైనర్ పంచాయతీకి రూ.10 వేలు, మేజర్ పంచాయతీకి రూ.25 వేలు ప్రకటించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు కాకర బాబ్జి, సలాది బుచ్చిరాజు, ప్రభాత్‌కుమార్, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎనిమిది మద్యం సీసాల పట్టివేత

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది మద్యం సీసాలను సుంకరపాలెం చెక్‌పోస్టు అధికారులు శనివారం పట్టుకున్నారు. రాజమహేంద్రవరంకు చెందిన యువకుడు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు చెక్‌పోస్టు ఎస్సై రామస్వామి తెలిపారు.

జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా శ్రీనివాస్

మలికిపురం: అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా మలికిపురం మండలం పడమటిపాలెం ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఏవీ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు డీఈవో కమలకుమారి నుంచి నియామక ఉత్తర్వులు తీసుకున్నారు. శ్రీనివాస్ శనివారం మలికిపురంలో మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. డీఈఓకు ధన్యవాదాలు తెలిపారు.

రాత్రయితే చుక్కలే..

- పేరుకే 24 గంటల వైద్యం
- అందని వైద్య సేవలు
- గ్రామీణులకు ఆపదొస్తే అంతే సంగతులు



భీమనపల్లిలో తాళం వేసి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఉప్పలగుప్తం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో పీహెచ్‌సీలు ఉన్నా ఆపదొస్తే అత్యవసర వైద్యం నిమిత్తం అటు అమలాపురం, ఇటు ముమ్మిడివరం ఏరియా, ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి గ్రామాల్లో ప్రస్తుతం నెలకొంది. ఈ లోపు దారిలో ఏం జరిగినా అత్యవసర వైద్యం అందే పరిస్థితి లేదు. రాష్ట్రంలో ప్రజలు కోవిడ్‌తో సతమతమైన తరువాత వైద్య రంగంలో విపరీతమైన మార్పులు సంభవించాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కోవిడ్ అనంతరం అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 24 గంటలు పని చేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాత్రి సమయంలో సైతం వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రతి పీహెచ్‌సీ నుంచి ముగ్గురు స్టాఫ్ నర్సులను అందుబాటులో ఉంచారు. ముగ్గురులో ఒకరు ఉదయం ఆరు నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మరొకరు రెండు నుంచి రాత్రి పది వరకు, మూడో వ్యక్తి రాత్రి పది నుండి మరునాడు ఉదయం ఆరు గంటల వరకు మూడు షిఫ్టులుగా విధులు నిర్వర్తించి వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఈ ముగ్గురిలో ఏ ఒక్కరు సెలవు తీసుకున్న ఆ స్థానంలో మరో స్టాఫ్ నర్సు గానీ, ఎఫ్ఎన్ఓ లేదా వైద్యాధికారి అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆ తరహా సేవలందక ఏదైనా ఆపద సంభవిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాథమిక కేంద్రాల్లో స్టాఫ్ నర్సు అందుబాటులో లేకపోవడం, మరికొన్ని పీహెచ్‌సీల్లో నైట్ వాచ్‌మన్‌లు లేకపోవడంతో స్టాఫ్ నర్సులు విధులకు రావడానికి ఆసక్తి చూపించడం లేదు. కొన్ని పీహెచ్‌సీల్లో అయితే సాయంత్రం అయ్యే సరికి సమయం ఆసన్నమైందంటూ సిబ్బంది ఇంటి బాట పడుతున్నారు. వీరిని ఫోన్ చేసి బ్రతిమలాడితే తప్ప విధులకు వచ్చే పరిస్థితి లేదు. వీటిపై వైద్యాధికారులు సరైన చర్యలు తీసుకోక రాత్రైతే ఆసుపత్రులకు తాళాలు వేసి ఉండటంతో వైద్య సేవలు అందక ప్రజలు సుదూర ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారని స్థానికంగా ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రాత్రి వేళల్లో సైతం సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 11 పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో ముమ్మిడివరం సీహెచ్‌సీలో గైనకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రసవానికి వచ్చిన గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐ.పోలవరం మండలం కేశనపల్లి పీహెచ్‌సీలో నైట్ వాచ్‌మన్ పోస్టు ఖాళీ భర్తీ చేయాల్సి ఉంది. తాళ్లరేవు పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అనుసంధానం చేసినా అక్కడ సిబ్బంది రాత్రి పూట అందుబాటులో ఉండటం లేదని ఇటీవల జరిగిన డైరెక్టర్ల ఎంపిక కార్యక్రమంలో గ్రామస్తులు ఆరోపించారు. అమలాపురం నియోజకవర్గంలో రెండు అర్బన్ సెంటర్లు, ఒక ఏరియా ఆసుపత్రి, ఒక సీహెచ్‌సీ, 7 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో ఉప్పలగుప్తం పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సు పోస్టు ఖాళీగా ఉంది. భీమనపల్లి, గోడిలంక, బెండమూర్లంక పీహెచ్‌సీల్లో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉన్నా నైట్ వాచ్‌మన్‌లు లేక మహిళా ఉద్యోగులు విధులకు రావడానికి ఆసక్తి చూపించడం లేదు. బెండమూర్లంకలో ఎఫ్ఎన్ఓ, ఎంఎన్‌వో సహాయాలతో స్టాఫ్ నర్సులు రాత్రి వేళల్లో విధులు నిర్వర్తిస్తున్నా మిగతా చోట ఆ పరిస్థితి కనిపించడం లేదు.

24 గంటలూ తెరచి ఉంచాలి



"ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆసుపత్రి తెరచి ఉంచాలి. ప్రతి ఆసుపత్రిలో ముగ్గురు నర్సుల 8 గంటల చొప్పున విధులు నిర్వర్తించాలి. స్టాఫ్ నర్సు లేని పక్షంలో సిబ్బందిని అందుబాటులో ఉంచి కాల్ డ్యూటీ చేసే విధంగా వైద్యాధికారులకు ఆదేశాలిచ్చాం. కొన్ని ఆసుపత్రుల్లో నర్సులు పదోన్నతులు పొంది కొందరు, బదిలీలపై మరికొందరు వెళ్లటంతో పోస్టులు ఖాళీ అయ్యాయి. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తే ప్రతి స్థానాన్ని భర్తీ చేస్తాం. సిబ్బంది ఎవరొకరు అందుబాటులో ఉండి ప్రథమ చికిత్స అందించి స్థానిక వైద్యాధికారికి సమాచారం అందించాలి."

– సీహెచ్‌వీ భరతలక్ష్మి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, అమలాపురం

అసెంబ్లీని తాకిన నిరసన సెగ



అసెంబ్లీ వద్ద నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

యానాం: బకాయి వేతనాలు చెల్లించాలని సరాసరి జీతాలను ట్రెజరీ ద్వారా చెల్లించాలని తదితర డిమాండ్లతో గత నాలుగురోజుల పాటు చేసిన నిరసన దీక్షల అనంతరం శనివారం నిరసనకారులు పుదుచ్చేరి అసెంబ్లీని ముట్టడించారు. తమ జీతాలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారానే ఇవ్వాలని అదే విధంగా 7వ వేతన సంఘ సిఫారసులను అమలు చేయాలని ఏరియర్స్ మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. పుదుచ్చేరి, మాహే, కారైకల్, యానాం రీజియన్ల నుంచి మున్సిపల్ సిబ్బంది ర్యాలీగా వచ్చిన మున్సిపల్ సిబ్బందిని అసెంబ్లీ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ నిరసనకు ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కలియాపెరుమాల్, సకయరాజ్, బాలమురుగన్ తదితరులు నాయకత్వం వహించారు.

'కొల్లి'కి మాదిగ ఉద్యోగుల నివాళి



సూర్యారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాదిగ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమ ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత కొల్లి సూర్యారావు అకాల మృతి మాదిగ ఉద్యమాలకు, జాతికి తీరని లోటని మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు అన్నారు. సూర్యారావు స్వగ్రామం అంబాజీపేట మండలం పుల్లేటికుర్రులో ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర, జిల్లా డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ మాదిగ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శనివారం పరామర్శించారు. సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు అమలాపురంలో ఓ ప్రకటన విడుదల చేసి సంతాపం తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు, యార్లగడ్డ రవీంద్ర, మాదిగ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తెన్నేటి రాజబాబు, కె.కృపాకర్, నవుంద్రు వాడపల్లి తదితరులు పాల్గొన్నారు.

ఎల్జీ మనుమరాలికి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

- వైద్యులకు 2 గంటల నిరీక్షణ
- హుటాహుటిన సీఎం రాక

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కైలాస్‌నాథన్ ఈ నెల 7న బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి భార్య, కూతురు, అల్లుడు, మనుమరాలు వచ్చి రాజ్‌నివాస్‌లో బస చేశారు. అయితే కైలాసనాథన్ తన తొమ్మిదేళ్ల మనుమరాలు మిరయకు శుక్రవారం రాత్రి తీవ్రమైన జ్వరం రావడంతో కైలాషనాథన్‌తో పాటు ఆయన భార్య, మనుమరాలిని తీసుకుని స్థానిక రాజీవ్‌గాంధీ మహిళ, చిన్నపిల్లల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అయితే వైద్యం కోసం వారు ఆసుపత్రి ఆవరణలోనే రెండు గంటలపాటు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న సీఎం రంగసామి హుటాహుటిన ఆసుపత్రికి వచ్చి ఎల్జీని వివరాలు అడిగి చిన్నారి వైద్యం కోసం వైద్యులతో మాట్లాడి వారిని తక్షణం రప్పించారు. పుదుచ్చేరి ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజీవ్, డైరెక్టర్ శ్రీరాములు, హాస్పిటల్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ రోసారియో, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గురుప్రసాద్ తక్షణం వచ్చి వైద్యసేవలను పర్యవేక్షించారు శనివారం చిన్నారి మిరయ కోలుకున్న అనంతరం ఆమెను డిశ్చార్జ్ చేశారు.

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఆర్‌పీవో మునిస్వామి, అధికారులు

యానాం: మత్స్యకారుల శిక్షణ కాలంలో నేర్చుకున్న నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌పీఓ మునిస్వామి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్ఎస్‌పీ కాన్ఫరెన్స్ హాలులో మూడు రోజులుగా వివిధ గ్రామాల్లోని మత్స్యకారులకు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ అండ్ ఇంజినీరింగ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో జరిగిన నైపుణ్య శిక్షణ కార్యక్రమాల ముగింపు సందర్భంగా సర్టిఫికెట్ల ప్రధాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో మత్స్యకారులు వేటకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బోటు నిలిచిపోయిన సమయంలో సరిచేయాల్సిన విధానాలను నేర్చుకున్నారన్నారు. అనంతరం సర్టిఫికెట్లను శిక్షణ పొందిన వారికి అందజేశారు. అధికారులు వీఎల్ పూజర్, హరనాథ్, అర్జున్, మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య, ఎస్ఎస్‌పి ఏడీపీసీ కమిడి ప్రభాకర్ పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణా, హుండీల చోరీలను అరికట్టాలి



ఎస్పీ కృష్ణారావుకు వినతిపత్రం అందించి సత్కరిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ దళ్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లాలో తరుచూ జరుగుతున్న గోవుల అక్రమ రవాణా, పలు దేవాలయాల్లో జరుగుతున్న హుండీల చోరీలను అరికట్టాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుకు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ దళ్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధుల బృందం వినతిపత్రం అందించి ఫిర్యాదు చేసింది. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని ఆ బృందం శనివారం కలసి ఆ రెండు సమస్యలపై కొద్దిసేపు చర్చించింది. గోవుల అక్రమ రవాణా, దేవాలయాల్లో హుండీల చోరీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీకి బృందం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, భజరంగ్ దళ్ రాష్ట్ర సహ ప్రముఖ్ శిరంగు నాయుడు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి గొవ్వాల అచ్యుతరామయ్య, జి.నాగరాజు, ఆర్ఎస్ఆర్ కుమార్ తదితరులు ఎస్పీని కలసి వినతి పత్రం అందించిన వారిలో ఉన్నారు. ఇటీవలే జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారావు వీహెచ్‌పీ, భజరంగ దళ్, ఆర్ఎస్ఎస్ తరపున ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అనైతికం



కుంచే రమణారావు

ఉప్పలగుప్తం: విజయవాడ స్వరాజ్ మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహంపై తెలుగుదేశం, జనసేన చేసిన దాడి అనైతిక చర్య అని ఇది దళితుల మనోభావాలను దెబ్బతీసిందని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుడ్ ఫీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పలగుప్తంలో శనివారం రమణారావు విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి దేశ ప్రజలను అవమానించడమేనన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలు, ఆగడాలు రోజురోజుకూ మితిమీరి పోతున్నాయన్నారు. అంబేడ్కర్ స్మృతి వనం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలు విద్యుత్ దీపాలు ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఈ దాడికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక చారిత్రక ఘట్టానికి ఆద్యుడిగా నిలిచారని ఇది సహించలేక ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. భావితరాలకు స్ఫూర్తిగా దిక్సూచిగా పెట్టిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించే కుట్రలో భాగంగా ఈ దాడి జరిగిందన్న అనుమానాలు దళితుల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం స్పందించి ఘటనపై విచారణ జరిపించడమే కాకుండా బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపట్టేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



మామిడికుదురులో విరాళాలు సేకరిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

మామిడికుదురు: కేరళలోని వయనాడ్ బాధితుల కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు విరాళాలు సేకరిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం మామిడికుదురులో అంగన్‌వాడీ ఉద్యోగులు పలువురు దాతల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. కోనసీమ జిల్లా అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఈ విరాళాలు సేకరిస్తున్నారు. సేకరించిన విరాళాలను అంగన్‌వాడీ యూనియన్‌కు అందజేస్తామని తెలిపారు. విరాళాల సేకరణలో అంగన్‌వాడీ యూనియన్ మండల శాఖ అధ్యక్షురాలు ఎస్.అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు వీఎంజీ కుమారి, ఎస్.రాజ్యలక్ష్మి, కె.మంగతాయారు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ ముఖ్యం

మలికిపురం: యువత క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ కలిగి ఉండాలని మలికిపురం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ సూచించారు. శనివారం మలికిపురంలో ప్రధాన రహదారులపై ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. వెహికల్ చెకింగ్‌లో ఐదు నంబర్ లేని మరియు సైలెన్సర్ లేని మోటార్ సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా సరే మోటార్ సైకిల్ కి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా గాని నెంబర్ లేకుండా గాని సైలెన్సర్ లేకుండా గాని వెళ్లిన యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

ఇస్లాం చరిత్రలో బీబీ సకీనాను మరువలేం



అమలాపురంలో గుండెల బాదుకుంటూ మాతం నిర్వహిస్తున్న షియా ముస్లింలు

అమలాపురం టౌన్: ఇస్లాం చరిత్రలో బీబీ సకీనాను ముస్లింలు ఎన్నటికీ మరువలేరని ఢిల్లీ నుంచి వచ్చిన మౌలానా ముజఫర్ హుస్సేన్ జైదీ అన్నారు. స్థానిక గొల్లగూడెంలోని బీబీ సకీనా పీర్ల పంజా వద్ద శనివారం జరిగిన బీబీ సకీనా వర్థంతిలో హుస్సేన్ జైదీ మాట్లాడారు. కర్బలాలో 1446 ఏళ్ల కిందట ఇమామ్ హుస్సేన్ నాలుగు సంవత్సరాల కుమార్తె బీబీ సకీనాపై జరిగిన దాడి ఘటనను జైదీ ముస్లింలకు కళ్లకు కట్టినట్లు వివరించారు. నాటి హృదయ విదాకర ఘటనను నేటి షియా ముస్లింలు ఇంకా మరువకుండా బాధా తప్త హృదయాలతో ఇమామ్ కుటుంబ సభ్యులను స్మరిస్తూ రక్తం చిందేలా గుండెలు బాదుకుంటూ మాతంతో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం హజరత్ అబ్బాస్ పీర్లను అమలాపురం పురవీధుల్లో ఊరేగించారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి షియా ముస్లింలు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. నల్ల దుస్తులు ధరించి షియా ముస్లింలు మాతంలో పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాలకు పిలవకుండా అవమానిస్తున్నారు

జనసేన సర్పంచ్ చిట్నీడీ శ్రీదేవి

అల్లవరం: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి అయిన ఆనందరావుని సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించడంలో కీలక పాత్ర పోషిస్తే తమకు అధికారిక కార్యక్రమాలకు పిలవకుండా అవమానిస్తున్నారని జనసేనకు చెందిన గోడితిప్ప సర్పంచ్ చిట్నీడీ శ్రీదేవి ఆరోపించారు. గోపాయిలంకలోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జనసేన నాయకులకు మనుగడ లేదన్నారు. టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే ఆనందరావు ఇస్తున్న ప్రాధాన్యత జనసేన పార్టీకి చెందిన వారికి ఇవ్వడం లేదన్నారు. జనసేన పార్టీ తరపున ఏకగ్రీవంగా గోడితిప్ప పంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికయ్యానని తెలిపారు. అల్లవరం మండలంలో జనసేన పార్టీకి సరైన నాయకత్వం లేకపోవడంతో టీడీపీ ఆధిపత్యం చెలాయిస్తోందన్నారు. గోడితిప్ప సచివాలయం ప్రారంభోత్సవం, గోపాయిలంక స్లూయిజ్ సందర్శన, వరద ప్రభావిత ప్రాంతాల్లోని పాడి రైతులకు టీఎంఆర్ దాణా పంపిణీ విషయంలో స్థానిక సర్పంచ్‌ని పట్టించుకోకుండా ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. కూటమి ప్రభుత్వంలో జనసేన మిత్ర పక్షమైనా క్షేత్రస్థాయిలో జనసేన కార్యకర్తలకు గౌరవం దక్కడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో జనసేనకు సరైన గుర్తింపు దక్కకపోతే జనసేన పార్టీ నుంచి వైదొలుగుతానని సర్పంచ్ శ్రీదేవి తెలిపారు. ఆమెతో పాటు సర్పంచ్ భర్త శ్రీనివాసరావు టీడీపీ నాయకుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు

ఆలమూరు: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు సమీపిస్తున్న దృష్ట్యా జిల్లా పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యగా మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం పారిశుధ్య చర్యలు ముమ్మరం చేశారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేసి చెత్త చెదారాన్ని బయటకు తరలించారు. వాటర్ ట్యాంకులకు క్లోరినేషన్ చేయిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో బ్లీచింగ్ చల్లి పరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్తపూత నమూనా పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై భరోసా కల్పిస్తున్నారు. గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఎంపీటీసీ సభ్యుడి రాజీనామా

మలికిపురం: మండలంలోని రామరాజులంక-2 గ్రామ ఎంపీటీసీ మేడిచర్ల వెంకట్రాజు వైఎస్సార్ సీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీకి రాజీనామా చేస్తూ పదవిలో కొనసాగుతానని తెలిపారు.

నేటి నుంచే ప్రతి ఇంటిపై జాతీయ జెండా



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

మామిడికుదురు: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆదివారం నుంచి గురువారం వరకు ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేసేలా కార్యాచరణ చేపట్టాలని బీజేపీ కార్యకర్తల సమావేశం పిలుపునిచ్చింది. మామిడికుదురు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జరిగిన సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షత వహించారు. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించాలని, స్కూల్ విద్యార్థులతో త్రివర్ణ పతకాల ప్రదర్శన నిర్వహిస్తామని రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు కంకిపాటి సుబ్బారావు తెలిపారు. స్వాతంత్య్రోద్యమ నాయకుల విగ్రహాలను శుభ్రం చేయడం, పూలమాలల అలంకరణ, విగ్రహాల పరిసరాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో పసుపులేటి మహాలక్ష్మీరావు, వేగి వెంకటేశ్వరరావు, నక్కా త్రిలోచనరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, సుంకర నాగభూషణం, తూము సాయి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ పాత్ర ఎంతో కీలకం



మామిడికుదురులో యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలో పాల్గొన్న ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు

మామిడికుదురు: రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మామిడికుదురు మండల మానవ వనరుల కేంద్రం వద్ద యూటీఎఫ్ పతాకాన్ని ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ఎంతో కీలక పాత్ర పోషించిందని వారు గుర్తు చేశారు. యూటీఎఫ్ సాధించిన విజయాలు చరిత్ర పుటల్లో సజీవంగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జి.నాగప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు, ప్రతినిధులు కుడుపూడి సత్యనారాయణ, వైఎస్సార్‌వీ అప్పారావు, యెరుబండి నాగేశ్వరరావు, టీఆర్‌కే గణపతిరావు, గుబ్బల మురళీకృష్ణ, అమలదాసు సత్తిబాబు, కె.నరసింహారావు, ఏవీ శ్యామలావతి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాలుకు రూ.14 వేల సాయం



బాధితుడికి కృత్రిమ కాలుకు సాయం అంజేస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో కాలుపోయి కృత్రిమ కాలు కోసం సాయం అర్థించిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.14 వేల ఆర్థిక సాయం అందజేశారు. రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన గనిశెట్టి సతీష్ లారీ క్లీనర్‌గా చేసేవారు 20 సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్రగాయమయింది. ఇంతకాలం కాలికి ట్రీట్‌మెంట్ చేయించుకున్నారు. 3 నెలల క్రితం కాలు తీసేశారు. ఈయనకి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు, కృత్రిమ కాలు పెట్టించుకుని ఏదో ఒక పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలని అనుకుంటున్నారు. కృత్రిమ కాలు పెట్టించుకోవడానికి డబ్బులు లేని పరిస్థితి. దీంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. పసలపూడిలో సతీష్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.14 వేలు నగదు సాయంగా అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

కార్డుదారులందరికీ రేషన్ అందించాలి



ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: అర్హులైన కార్డుదారులందరికీ రేషన్ పూర్తి స్థాయిలో సక్రమంగా అందించాలని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. మాచవరంలో ఎండీయూ వాహనం ద్వారా పంపిణీ జరుగుతున్న రేషన్‌ను శనివారం తహసీల్దార్ పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్వరి మాట్లాడుతూ ఇళ్ల వద్దకు వచ్చిన ఎండీయూ వాహనాల నుంచి బియ్యం తీసుకోవాలన్నారు. సాంకేతిక లోపాలు తలెత్తినా వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వో రమేష్‌లు పాల్గొన్నారు.